# మరో కవస్తువు

మా యింట్లో ఒక పెద్ద చెక్కపెట్టె ఉంది. దానిని ఒక్క సిట్టింగ్ రూములో—అనగా సోఫా ఉండేచోట మినహా—మిగతా అన్నిచోట్లకీ పిల్లిపిల్లల్ని మార్చినట్టు మార్చాము. కొన్నాళ్ళు అది వంటయింట్లో ఒకపక్కగా పడి ఉండేది. తర్వాత కొంతకాలం అది పడకగదిలో ఒకమూలగా ఉండేది. అక్కడనుంచి స్థానచలనం కలిగి, వసారాలోకి వచ్చి, అక్కడ కొన్నాళ్ళు ఉంది. ఏమయితేనేం, దానిని ఎలా వొదిలించుకోవాలో మా యిద్దరికీ తెలిసేదికాదు. ఉన్నదని ఉపయోగమూ లేదు; అక్కర్లేదని వీధిలో పారెయ్యనూ లేకపోయేవాళ్ళం.

సంసారమనగానే యిలాటి వస్తువులు చాలా తమాషాగా చుట్టుకుంటాయి. నిజానికి ఆ చెక్కపెట్టె ఎందుకూ పనికిరాదు. వంటయింట్లో వున్నప్పుడు ఖాళీడబ్బాలూ, అమ్మకానికి రెడీగా వున్న సిరాబుడ్లూ, హార్లిక్సు సీసాలూ మొదలైనవి అందులో పారేసేది శాంతాదేవి. కొంతకాలమయాక, వంటయింట్లో ఆ పెట్టె ఉంచేందుకు వీల్లేదని, దాన్ని కాస్త పడకగదిలోకి మార్చింది. ఆ రోజుల్లో పాత పేపర్లూ, పాత వీక్లీలూ, కనిపించని బనియనులూ, జారిపోయాయనుకున్న జేబురుమాళ్ళూ అవన్నీ అందులో ఉండేవి. ఆ పెట్టెనిండా అలా గుట్టగా పారేస్తూండేవాళ్ళం.

ఏ రెణ్ణెల్లకో మూణ్ణెల్లకో పాత పత్రికలు అమ్మేస్తున్నప్పుడు, పోయాయనుకుని ఆశలు వొదులుకున్న కొన్ని వస్తువులు, అందులోనుంచి తమాషాగా బయట పడుతూండేవి. ముఖ్యంగా తుడుచుకునే తువ్వాలు, అప్పుడప్పుడు నా అశ్రద్ధ వల్ల, ఆ పెట్టెలోకి మాయమవుతూండటం చూసి, శాంతా దేవి ఆ పెట్టెని పడకగదిలోనుంచి మార్చాలంది. నేను అభ్యంతరం చెప్పలేదు. అదీగాక మనమాట ఎవరిక్కా-వాలి?

"వెధవపెట్టె—దీనిని ఏం చెయ్యడానికీ తోచడంలేదు," అంది శాంత.

"చూడు. నేనొక మంచి సలహా చెప్పనా? ఒక్కొక్క ముక్క విరిచి పొయ్యిలో పెడుతూండు,"అన్నాను, నాకు తోచింది చెప్పాను.

"ఊఁ. మీరు చెప్పలేదనే ఆలోచిస్తున్నాను. పొయ్యిలో పెట్టేందుకు మనింట్లో పొయ్యి ఉంటేగదా! పోనీ, బాయిలర్‌లో వేద్దామన్నా, ముందు ఈ పెట్టె బద్దలుగొట్టి, చిన్న చిన్న చెక్కలుగా కోసి........."

ఆమె వాక్యం పూర్తి అవకుండానే 'అదెంత పని!' అన్నాను.

'సంతోషించాం గాని ఈ పెట్టె సాయం పట్టండి," అంటూ, ఆ ఖాళీ పెట్టెని, నా చేత వసారాలోకి సాయం పట్టించింది. మన కథాకాలంనాటికి ఆ పెట్టెలో గాజు

సామానులవాడికి యివ్వవలసిన పాతచొక్కాలూ, స్టెయిన్ లెస్ పాత్రలవాడికి యివ్వవలసిన పాతచీరెలూ ఉంటు న్నాయి. వాటితోబాటు శేరుబియ్యం పుడికేగిన్నె, కారి యర్, కుక్కర్ మొదలుగాగల కొన్ని యిత్తడి సామానులు కూడా అందులో తల దాచుకుంటున్నాయి. అంతేగాక రెండు మూడు ఎలుకలుకూడా అందులో కాపరం చేస్తు న్నాయి.

ఒక చెక్కపెట్టె గురించి యింత చెబుతున్నాడేమిటి?- అని అనుకోకండి. అది మామూలు కర్రపెట్టె కాదు. ఏదో ఒకమూల పారేస్తే పడివుండే రకం కాదు. బోలెడంత స్థలం ఆక్రమించుకుంటుంది. ఎక్కడపెడితే అక్కడ, అది ప్రత్యే కత వహించి, మిగతా వస్తువులకి చోటులేకుండా చేస్తుంది. ఘన పరిమాణంలో అది ఎంత ఉంటుందో కొలిచి చెప్ప డానికి బదులు, పుజ్జాయింపుగా చెబుతాను. మూడు ట్రంకు పెట్టెలుకింద పేర్చి, వాటిమీద మరొక మూడు ట్రంకు పెట్టెలు వుంచిన తర్వాత కూడా, ఆ పెట్టెపైన వున్న చెక్కలు చక్కగా పేర్చవచ్చు. చెక్కలు పేర్చడమని ఎందుకంటున్నానంటే, ఆ పెట్టెకి తలుపులూ గిలుపులూ లేవు. పైన చెక్కలు పేర్చడమే దానికి మూత.

ఇలాటి రాక్షసపెట్టె—యించుమించు భోషాణం అంత పెట్టె—మా యింటికెందుకు వచ్చింది, ఎలావచ్చింది, ఎలా రానిచ్చారు, అని అడగవచ్చు, మనవి చేస్తాను. మేము

ఈ ఊరు వస్తున్నప్పుడు శాంతాదేవి వాళ్ళ అన్నగారిని అడిగింది; 'అన్నయ్యా, అన్నయ్యా—ఈ సామానంతా పట్టే ఒక మాంచి పాకేజీపెట్టె తెప్పించిపెట్టు' అని.

ఆయనగారు హుటాహుటీని బజారుకు పోయి, బజారులో వున్న మేలురకం పాకేజీ పెట్టెలలో ఒకటోరకమయినది ఖరీదుచేసి పట్టుకొచ్చాడు. దానిలో సామానంతా పడే శాము. సామానుతో వున్న ఆ చెక్కపెట్టెని అక్కడ గుడ్సులో వేసేందుకు ఆరుగురూ, యిక్కడ దించుకునేందుకు ఆరుగురూ కావలసి వచ్చారు. సామానంతా మట్టుకు సవ్యంగా వచ్చింది. ఆ సామానుతో బాటు ఈ రాక్షసపెట్టె మాకు హరణమయింది.

"అమ్మబోతే అడవి, కొనబోతే కొరివిలా" కొన్ని వస్తువులని మనం వీధిలో గిరవాటుపెట్టలేము. అలా అని యింట్లో దాచుకోనూలేము. కాళ్ళకి తగులుతున్నట్టు వుంటాయి ఆ వస్తువులు. వాటిని చూస్తున్నప్పుడల్లా చీకాకు పుడుతుంది. చీమలూ జెర్రులూ పాకినట్లవుతుంది.

మా చెక్కపెట్టెలాటిదే వున్నదనుకోండి. దాన్ని వీధిలో పారెయ్యడమెలా?-ఇద్దరు సాయంపట్టి వీధిలో పారెయ్యాలి. ఒకవేళ అలా చేశామే అనుకోండి. మాకు మతిపోయిందని చుట్టుపక్కలవాళ్ళు అనుకుంటారు. చూస్తూచూస్తూ విరిగిన ఫవుంటెన్ పెన్నే పారెయ్యలేము; దెయ్యమంత పెట్టెని పారెయ్యడానికి చేతు లెలావస్తాయి?

ఈ చెక్కపెట్టె మా యిద్దరి మధ్యా ఒక సమస్య అయి కూచుందనీ, దాన్ని గురించి తీరిక సమయాలలో వాదులాడు కుంటున్నామనీ అనుకోవద్దు. అలాటిదేమీ లేదు. దాని దారిని అది వుంటుంది, తిండీ తిప్పలూ అడగడం లేదు సరి గదా అని సరిపెట్టుకున్నాం.

* * * *

దేనికయినా కర్మ పరిపక్వమవా లన్నారు పెద్దలు. మా చెక్కపెట్టెకి ఆ రోజులు దగ్గర్లో పడ్డాయి. ఆ ఉదయం వేళ నాకు చెక్కపెట్టెమీద వ్యాసం రాయాలనిపించింది. కాని మన వ్యాసాలకి మార్కులూ, షిల్లింగులూ యిచ్చేదాతలు లేరు. స్కూల్ ఫైనల్లోనో, ఫిఫ్త్ఫారంలోనో రాశాను: కుర్చీ ఆత్మకథ. చెక్కపెట్టె ఆత్మకథ రాయా లనిపించింది ఆ ఉదయం వేళ.

"చూడండి—ఆ అబ్బి పెద్ద కార్ఖానాలో పనిచేసేవాడట. అన్ని వ్యాపారాలూ మందకొడిగా ఉండటంవల్ల అతన్ని పనిలోనుంచి తీసేశారట. బీరువాలూ, గీరువాలూ చేసే వాడట ఆ కార్ఖానాలో ఉన్నప్పుడు."

వీధిగుమ్మంలో ముప్ఫయ్యయిదేళ్ళ మనిషి నుంచున్నాడు. అతని చేతిలో సంచీ ఉంది. అందులో వడ్రంగం సామాను ఉంది. అతన్నొకసారి ఆపాదమస్తకం చూసి శాంతాదేవి వైపు తిరిగాను.

"వెనక రెండుసార్లు వచ్చాడు—ఏదైనా పని యిప్పించ మన్నాడు—పిల్లలుగల వాణ్ణి—అంటూ. మన పనిమనిషికి దూరపుచుట్టం ట కూడాను."

కాఫీ గ్లాసులు కడుగుతున్న మా పనిమనిషి, చేస్తున్న పని క్షణకాలం ఆపి, ఆ వడ్రంగి తన కోడలియొక్క చెల్లెలి యొక్క మొగుడు అని చెప్పింది.

"నేనేం పని యిప్పించగలను?" అన్నాను శాంతని ఉద్దేశిస్తూ.

"బాగానేఉంది. పని యిప్పించడమంటే, ఉద్యోగం యిప్పించడం కాదు. పిల్లికి బిచ్చం పెట్టరు, మీరు చేస్తారా, నాకు తెలీదూ మీ సంగతి? అది కాదండీ, ఆ చెక్కపెట్టె ఉంది చూశారూ, దాన్ని మార్పించి, ఓ చిన్న బీరువా చేయిద్దాం." అంది శాంతాదేవి.

బీరువా అనగానే ఆ ఐడియా నాకూ నచ్చింది. మాకో చిన్నబీరువా ఉండాలి. ఇప్పుడు యిద్దఱికీ చెరొక బట్టల బీరువా లేక కాదు; మరొకటి ఉండాలి. ముఖ్యంగా నా పుస్త కాలు పెట్టుకునేందుకు. ఒక చిన్నబీరువా చేయించుకుని, అందులో నాక్కావలసినవి ఒకవంద పుస్తకాలు పెట్టుకుని, అప్పుడప్పుడు ఒక్కొక్క పుస్తకమే చదువుకుంటూంటే, ఎంత చక్కగా ఉంటుంది. ప్రతి యింటికీ చిన్నలైబ్రరీ ఉండాలి. వందో రెండొందలో మనకి నచ్చిన పుస్తకాలు. అనుకున్నప్పుడు ఏదో ఒక పుస్తకం చటుక్కున లాక్కుని,

ఒక పదిపేజీలు చదివి, మళ్ళా యథాస్థానంలో పెట్టేస్తూం డటం. చిన్నబీరువా, ఆ చిన్నబీరువాలో నేను సర్దుకునే పుస్తకాలూ, అన్ని పుస్తకాలకి ఒకమాదిరి అట్టే వెయ్యా డం—యిలా నా హోమ్ లైబ్రరీ గురించి కలలు కంటూం డగా శాంతాదేవి ఒక్కకసురు కసిరింది.

"ఏదో ఒకటి తెమిల్చి చెప్పండి. మన యింట్లో లేక పోతే మరొక చోటనయినా పని చూసుకుంటాడు,' అంది శాంతాదేవి.

"నీ యిష్టం."

"నాదేముంది—మీ యిష్టం. డబ్బు యిచ్చుకోవలసినది మీరు. చేయించమంటే చేయిస్తాను. లేకపోతే పొమ్మం దాం."

"ఏం చేయిస్తావ్ ?"

"చేయించ దలుచుకుంటే. ఏదో ఒకటి చేయిద్దాం. మొన్న మధ్యాహ్నం అతను చెక్కపెట్టె చూసుకువెళ్ళాడు. బంకులూ మేకులూ వగైరా మనం పెట్టుకు, కూలీ పది హేను రూపాయి లివ్వమన్నాడు."

"దేనికి ?"

"బీరువాకి అండి"

"చెక్క సరిపడుతుందా ?"

"సరి పడకపోతే తెప్పిద్దాం. ఇంట్లో ఒక వస్తువు అమురు తుంది; దిష్టిపిడతలావున్న ఈ పీడ వొదులుతుంది," అంది శాంతాదేవి చెక్కపెట్టెని ఉద్దేశిస్తూ.

"కానియ్" అన్నాను.

మా వడ్రంగి పేరేమిటో నేను అడగలేదుగాని అతన్ని గురించి మాట్లాడుకుంటున్నప్పుడు కార్పెంటర్ అనేవాళ్ళం. అతను తన సామానుల సంచీ లోపల పెట్టాడు. పెట్టె ఖాళీ చెయ్యమన్నాడు. చెయ్యమనడమేమిటి—తనే చేశాడు. ఆ పెట్టెని ముందరకడ వాకిలిలోకి పని మనిషి సాయంతో పట్టుకుపోయాడు. సుత్తితో రెండుసార్లు ధనధన మని పించి, లోపలి గుమ్మం దగ్గిరనుంచి, 'అమ్మగారూ!' అని పిలిచాడు.

నేను ఆదరాబాదరా నాలుగు మెతుకులు నోట్లో వేసుకుంటున్నాను. అవతల ఆఫీసుటైమయిపోతోంది. ఈ చెక్క పెట్టె హడావిడితో, శాంతాదేవి తరిగిన కూరముక్కలు అలానే వుండిపోయాయి. పచ్చడీ అన్నమే అయింది ఆ పూటకి.

"అమ్మగారూ" అని మళ్ళీ సన్నగా పిలిచాడు కార్పెంటర్.

"ఎందుకో కనుక్కో!" అన్నాను.

"అబ్బాయ్, అయ్యగారి భోజనమయేదాకా మాట్లాడటానికి వీల్లేదు. కాసేపు వుండు" అంది శాంతాదేవి.

"సరేనమ్మగారూ!" అంటూ అతను వీధిలోకి జారుకుని, బీడీ అంటించాడు.

నేను బట్టలు వేసుకు వీధిలోకి వెళ్ళబోతూంటే కాబోలు అడిగాడు : 'అయ్యగారూ, మేకులకి డబ్బు యిస్తారా ?'

"ఎంత ?"

"ఒక అయిదు రూపాయి లిప్పించండి తర్వాత లెఖ్ఖ చూసుకోవచ్చు. సామాను సంచీ యిక్కడే వుంటుంది బాబయ్యా, మీకా భయ మక్కర్లేదు—మీ కాళ్ళదగ్గిర బతికేవాళ్ళం."

అలాంటి నక్కవినయం చూస్తే నా కసహ్యం. అయినా ఏం చేస్తాం ? అయిదు రూపాయిలూ యిచ్చాను.

"ఎన్నాళ్ళు పడుతుంది ఈ పని ?"

"రెండురోజులు, బాబయ్యా. పని పూర్తయి వార్నిష్ వేసేవేళకి, టీక్ వుడ్ బీరువా లా కనుపించాలి."

శాంతాదేవి మా మాటల్లో జోక్యం కలిగించుకోక, విని వూరుకుంది.

* * * *

సాయంత్రం నేను యింటికి వచ్చేటప్పటికి శాంతాదేవి మొహం మబ్బుల్లో చంద్రుడులా ఉంది. ఎంతదిగులో ఆమె మొహంలో.

"చూశారా, ఎంత పని చేశాడో ఆ వెధవ," అంది తలుపు తెరుస్తూ.

"అయిదు రూపాయిలు పుచ్చుకు పారిపోయాడా?"

"ఆ. పొద్దున్న మీ రుండగా వెళ్ళాడా-మళ్ళీ కనిపిస్తే వొట్టు."

"పనిమనిషి నడక్కపోయావ్ ?"

"వాడు అలాటివాడు కాడు అమ్మగారూ—అంది. ఇంతకీ సామాన్లు సంచీ యిక్కడే పడేసి పోయాడు."

"అయితే మనకి నష్టంలేదు. అయిదు రూపాయిలకి బదులు రంపం, సుత్తీ, చిత్రికపట్టేది—యిలాటి వడ్రంగి సామానులు మిగులుతాయి. మనకి నష్టం లేదులే—విచారించకు," అంటూ బుజం మీదతట్టి వోదారుస్తూ లోపలికి తీసుకొచ్చాను.

శాంతాదేవికి కలిగిన విచారమెందుకో నాకు తెలుసు. అయిదు రూపాయిలు పోయాయని కాదు. తను దయతలిచి పనియిప్పిస్తే వాడు యిలా చెయ్యడమూ? తను మంచి చెయ్యబోతే చెడు కింద పరిణమించడమూ? కూడూ గుడ్డా లేదన్నాడని కనికరిస్తే యింత పచ్చి మోసమూ? మేకులు తీసుకొని అరగంటలో వస్తానని పొద్దున్న పదిగంటలకి వెళ్ళిన మనిషి, సాయింత్రం ఆరయినా కంటికి కనపడక పోవడమూ? ఎంత నమ్మక ద్రోహం!

"శాంతా, వాడెక్కడికీ పోడు—వస్తాడు. తన సామానులు యిక్కడ వున్నాయి గనక తప్పకుండా వస్తాడు," అని ఆమెని సముదాయించాను.

"ఇంతలో 'అమ్మగారూ !' అంటూ వీధి తలుపు తట్టాడు కార్పెంటర్. అమ్మగారు తలుపుతీస్తే, కాళికాంమ్మవాళు అవుతుంది. అందుకని నేను వెళ్ళి తలుపు తెరిచాను.

"ఏమిటోయ్, యిలా చేశావు ?" అన్నాను.

సేకుల పొట్లం, బందులూ లోపల పెడుతూ అన్నాడు:

"ఇవ్వాళ కోర్టులో నాదొక చిన్న సాక్ష్యం ఉంది, బాబయ్యా. ఇవి కొనుక్కు యింటికొస్తూండగా జ్ఞాపకం వచ్చింది. ఇంటికొచ్చి అయ్యగారికి చెప్పి వెళ్దామను కున్నాను—కాని టైము లేకపోయింది."

"ఏం సాక్ష్యం ?"

"ఒక పోకిరీ పిల్లకాయ బస్సులో నా పక్క కూచున్నా యన జేబు కత్తిరించాడు-పదిరోజుల క్రితం. నన్ను కూడా సాక్ష్యం వేసుకున్నారు."

"ఆ జేబు దొంగకి శిక్షపడిందా ?"

"ఒక సంవత్సరం వడ్డించారు బాబయ్యా !"

"వీధి కడ్డంగా ఈ పెట్టె పడి వుండటం బాగాలేదు. నువ్వు తొందరగా పనిపూర్తి చెయ్యాలి."

"ఎంతసేపు ? ఈ రాత్రి సగం పూర్తి చేస్తాము."

కార్పెంటర్ కోసమని ముందరి వాకిట్లో హాండ్ కాండిల్ బల్బు పెట్టాము. తొమ్మిదీ అయే వేళకి అతను వచ్చి పని మొదలెట్టాక, శాంతాదేవికి కొద్దిగా కోపం తగ్గింది.

కార్పెంటర్ కూడా అమ్మగారికి తనమీద ఆగ్రహం వచ్చిందని గ్రహించుకున్నాడు.

ఆ రాత్రి పన్నెండు గంటలదాకా మా వీధి వాకిట్లోని ధనాధన్ శబ్దాలతో యిల్లు దద్దరిల్లిపోయింది. ఇక మా నిద్దర్ల మాట చెప్పనే అక్కర్లేదు.

"ఈ పూటకి ఆపమందురూ! పొద్దున్నే లేవాలి," అంది శాంతాదేవి.

"నువ్వే చెప్పిరద్దూ!

"నేను మాట్లాడను వాడితో!"

"కార్పెంటర్‌తో పంతమేమిటి? మనకి కావలసినది పనిగాని, వాడేగంగలో దిగితే మనకెందుకు?" అన్నాను.

కార్పెంటర్ తెల్లారేదాకా పనిచేసేటట్టు వున్నాడు. కాని మేమే ఆపమన్నాం—యిరుగు పొరుగులకి నిద్రాభంగమని. అర్ధరాత్రివేళ యింటికెక్కడపోతానని-ముందరకడ చాపేసుకు పడుకున్నాడు కార్పెంటర్.

మర్నాటి పొద్దున్న అతను వెళ్తున్నప్పుడు శాంతాదేవి అంది; "అబ్బాయ్, యిలా అయితే కుదరదు—అర్ధరాత్రి వేళ అంకమ్మ శివాల్లా. తొమ్మిదీ అయ్యేవేళకి వచ్చి, సాయంత్రానికి సగం పని పూర్తి చెయ్యాలి."

"అలాగేనండి అమ్మగారూ" అని అన్నాడేగాని, ఆ రావడం ఉదయం తొమ్మిదింటికిగాక రాత్రి తొమ్మిదింటికి వచ్చాడు. మళ్ళీ పన్నెండు గంటల రాత్రిదాకా పని చేశాడు.

మూడోరోజు ఉదయం అతను వెళ్తున్నప్పుడు, 'ఎన్ని గంటలకి వస్తావ్ ?' అని మేము అడగలేదు. ఆ వేళ మధ్యాహ్నం ఒంటిగంటకే వచ్చాడట.

సాయింత్రం శాంతా దేవి చెప్పింది; "యినప జంగెడ— అయిరన్ మెష్— తెప్పించాను. చాలా పుచ్చుకున్నారండి. బిల్లుకూడా పట్టుకొచ్చాడు. లోపల వేసే అడ్డచెక్కలు కూడా పట్టుకొచ్చాడు."

"అడ్డచెక్కలమాట సరేగాని అయిరన్ మెష్ ఎందుకు?"

"కప్ బోర్డుకండీ-పాలూ పెరుగూ నెయ్యీ దాచుకునే కప్‌బోర్డు."

"మీట్ షెల్ఫా ?"

"మనం శాకాహారులంగా —మీట్ షెల్ఫా అనాలా ఏమిటి దాన్ని ?"

"సరేగాని బీరువా చేయిస్తున్నానన్నావుగా ?—బీరువా, అందులో దొంతరగా పేర్చుకునే పుస్తకాలు, ఒక్కొక్క పుస్తకమే తీసి చదువుకోవడం—ఆ మనోజ్ఞ దృశ్యమంతా కళ్ళముందు తిరిగింది.

"ఇది బీరువా కాదా—ఇదీ బీరువాయే" అంది శాంతా దేవి.

కార్పెంటర్ వారంరోజులు పనిచేశాడు; బీరువా కయితే పదిహేనుగాని మీట్‌షెల్ఫ్‌కి పని ఎక్కువ వుంది గనక పాతిక అన్నాడు; వార్నిష్ వెయ్యడానికి కూడా అయితే

మరొక మూడు రూపాయిలు యిప్పించమన్నాడు. తడిసి మోపెడయింది మా పని.

"ఏమండీ, మన కార్పెంటర్ మేకులకి మేకులు తినేస్తున్నట్లున్నాడు," అంది శాంతాదేవి.

"తిననీ—ఏం చేస్తాం?" అన్నాను. మా చెక్కపెట్టె కర్మ పరిపక్వత పొంది, శాంతాదేవి షెల్ఫ్‌గా మారేందుకు 65 రూపాయిల గురుదక్షిణ కోరింది. అదే షెల్ఫ్ మేము బజార్లో కొనివుంటే, పాతిక ముప్ఫయి కంటె ఎక్కువయేది కాదు. కాని బజార్లో కొన్నదానికి యింత చరిత్ర ఏముంటుంది? మాది చరిత్రాత్మకమైన షెల్ఫ్—ఆ విధంగానైనా తృప్తిపడకపోతే ఎలా?